క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు రూరల్: స్థానిక రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షతన సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చేబ్రోలు: ప్రమాద బీమాతో ఆయా కుటుంబాలకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేబ్రోలు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఆర్. చంద్రశేఖర్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని శలపాడు గ్రామానికి చెందిన గుమ్మడిదల కృష్ణ గత నెలలో మరణించాడు.ఇన్సూరెన్స్ పాలసీ కింద భార్య అంజనాదేవికి రూ.50 లక్షల ప్రమాద బీమా చెక్కును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ, తెనాలి రీజినల్ మేనేజర్ ఎల్. నూరిప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్లకు చెందిన మద్దెల రాజేష్ ద్విచక్ర వాహనంపై గుంటూరుకు వస్తున్నాడు. అదే సమయంలో ఎన్‌హెచ్ 16పై గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపుకు వెళుతున్న వాహనం మితిమీరిన వేగంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, అవతల వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రాజేష్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు అతడ్ని 108లో జీజీహెచ్‌కు తరలించారు. రాజేష్ పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. రాజేష్ తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

22న సిబార్ దంత వైద్య కళాశాలలో ఉచిత వైద్యసేవలు

పెదకాకాని: ఇండియన్ ప్రోస్థోడాంటిస్ట్స్ (జనవరి 22)డే సందర్భంగా పేదలకు ఉచిత దంత వైద్యసేవలు అందించనున్నట్లు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్ తెలిపారు. పూర్తిగాను, పాక్షికంగా పళ్ల లేనివారికి తీసి పెట్టుకునే పద్ధతిలో ఉచితంగా సెట్టు కడతామని చెప్పారు. కృత్రిమ పళ్ల సెట్ కోసం జనవరి 22వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు సిబార్ దంత వైద్య కళాశాలలోని కట్టుడు పళ్ల విభాగంలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు డాక్టర్ జె. రవిరాకేష్ దేవ్ 9502067978, డాక్టర్ జి. ఫణికృష్ణ 9885342725ను సంప్రదించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఈదులపాలెం (ప్రత్తిపాడు): మెట్లు ఎక్కుతూ జారి పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం గ్రామానికి చెందిన పొన్నాల విజయమ్మ (38) ఈ నెల 13న స్థానికంగా ఉన్న విగ్రహం వద్ద మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తూ జారి కిందపడింది. తలకు తీవ్ర గాయాలవ్వడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న కాటూరి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం విజయమ్మ మృతి చెందారు. ఈ మేరకు మృతురాలి కుమారుడు పొన్నల ప్రకాష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి. రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కొడుకు, కుమార్తె ఉన్నారు.

'అంబేడ్కర్ గురించి మాట్లాడే హక్కు బాబుకు లేదు'

పొన్నూరు: అంబేడ్కర్‌ను గౌరవిస్తూ విజయవాడ స్వరాజ్ మైదానంలో 206 అడుగుల ఎత్తులో విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బహుజన సమాజ్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు బెంగుళూరు జాలయ్య పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత సీఎం జగన్‌కు లేదని చంద్రబాబు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఎస్సీ కులాల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని హేళనగా మాట్లాడిన చంద్రబాబుకు ఎస్సీ కులంలో పుట్టిన అంబేడ్కర్ గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు పిచ్చి మాటలు మానుకోవాలని, దళితులపై అభిమానాన్ని చూపే సీఎం జగన్‌పై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

సంపూర్ణ ఆరోగ్య ప్రాప్తిరస్తు

- జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాలు ప్రారంభం
- నిపుణుల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య పరీక్షలు
- ఉచితంగా మందుల పంపిణీ


రేటూరులో నిర్వహించిన శిబిరంలో వైద్య పరీక్షలు


నాగులపాడు శిబిరంలో రోగుల్ని పరీక్షిస్తున్న వైద్యాధికారి విజయ రత్నకుమార్


నిడుబ్రోలు హెల్త్ క్లినిక్‌లో ప్రజలకు వైద్య పరీక్షలు


ప్రత్తిపాడులో రోగులకు కంటి వైద్య పరీక్షలు

రేటూరు(కాకుమాను): ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ షేక్ సైదా అన్నారు. మండలంలోని రేటూరులో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరు అనారోగ్యంతో బాధపడకూడదనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాలలోనే అనుభవజ్ఞులైన వైద్యులతో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.శిబిరాలలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను అందించడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలపై ప్రత్యేక దృష్టిపెట్టి అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రవిప్రసాద్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఆరోగ్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

పెదనందిపాడు: ప్రజలందరికీ ఉత్తమమైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని వైద్యాధికారి బి. విజయరత్నకుమార్ తెలిపారు. మండల పరిధిలోని నాగులపాడులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరత్నకుమార్ మాట్లాడుతూ శిబిరంలో 247 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించినట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవల్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. శిబిరంలో గైనకాలజిస్ట్ ఎల్. రవీనా, నేత్ర వైద్యుడు లక్ష్మీప్రతాప్, న్యూరాలజిస్టు కె. దాస్, సీహెచ్‌వో ప్రసాదస్వామి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా

పొన్నూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు వేముల మూర్తి రాజు అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు డాక్టర్ వైయస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు గూడవల్లి గంగాధర్ , మంద్రు వెంకటరత్నం , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రత్తిపాడు: ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్. దివ్యమేఘన అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ప్రత్తిపాడు-3 గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరానికి 120 మంది రోగులు హాజరయ్యారు. వైద్యాధికారులు డాక్టర్ దివ్యమేఘన, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ అతియా ఫర్హీన్‌లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మాత్రలు అందజేశారు. కంటి సంబంధ సమస్యలున్న 25 మందికి నేత్ర నిపుణులు డాక్టర్ టి. భాస్కర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్యమేఘన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. గ్రామాల్లోకే స్పెషలిస్టు వైద్యులు వచ్చి వైద్యమందిస్తున్నారని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సారథి విగ్రహావిష్కరణకు తరలిన ప్రజలు


పెదపలకలూరు నుంచి తరలి వెళుతున్న ప్రజలు, ప్రజా ప్రతినిధులు


కాకుమానులో తరలివెళుతున్న నేతలు


పొన్నూరు 13వ వార్డు నుంచి బస్సులో బయలుదేరిన ప్రజలు

కాకుమాను: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలం నుంచి నాయకులు, ప్రజలు శుక్రవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. 20 బస్సులలో సుమారు 800 మంది ప్రజలు అక్కడకు వెళ్లారు. బస్సులను ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గర్వించతగ్గ మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని పేర్కొన్నారు. అలాంటి మేధావి విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు.గతంలో ఏ నాయకుడు చేయని గొప్ప సంకల్పాన్ని చేపట్టిన ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు.బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని నిర్మించడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం కావడం రాష్ట్రానికే గర్వకారణమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీరాస్వామి, మోహనరావు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండల ప్రజలు గ్రామ గ్రామం నుంచి తరలి వెళ్లారు. స్వచ్ఛందంగా బస్సుల్లో వేల సంఖ్యలో మండలం నుంచి వెళ్లారు. ఆయా గ్రామాల సర్పంచులు, కార్పొరేటర్లు బస్సుల వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బస్సులను జెండాలు ఊపి ప్రారంభించారు.

పొన్నూరు: విజయవాడ నగరంలో శుక్రవారం జరిగిన భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్మృతివనం, 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, సామాజిక సమత సంకల్ప సభ కార్యక్రమానికి పొన్నూరు నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో వార్డులలో ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. ప్రజలకు కావలసిన సౌకర్యాల్ని వైఎస్సార్ సీపీ నాయకులు పర్యవేక్షించారు.

స్టాక్ మార్కెట్‌లో ఒడిదొడుకులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సాంబశివరావు

గుంటూరు ఎడ్యుకేషన్: స్టాక్ మార్కెట్‌లో ఒడిదొడుకులపై పెట్టుబడిదారులకు అవగాహన అవసరమని ఎంసీఎక్స్ మెటల్ అండ్ ఎనర్జీ సంస్థ ప్రతినిధి ఎం. సాంబశివరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మహిళా సాధికారత విభాగ ఆధ్వర్యంలో మూలధన మార్కెట్లలో మదుపు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడి పెట్టే ముందుగా ఆయా సంస్థల పురోగతి, వ్యాపార, వాణిజ్య స్థాయి, మార్కెట్లో షేర్ క్యాపిటల్, టర్నోవర్, ఉద్యోగుల సంఖ్య తదితర విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థల పనితీరును పరిశీలించాలని తెలిపారు. స్టాక్‌కు, కమోడిటీకి వ్యత్యాసాలతో పాటు కమోడిటీలో వర్తకం చేస్తున్నప్పుడు కలిగే ప్రయోజనాలు, వాటిలో రిస్క్, నష్టాలను వివరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, మహిళా సాధికార విభాగ డైరెక్టర్ చల్లా వైష్ణవి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అధ్యాపకులు డి. కళ్యాణి, డాక్టర్ గోప శ్రీనివాసరావు, ఏ. బాజీబాబు, సీహెచ్. వేదవతి, ఎస్. మణికంఠ, వి. అభిలాష్, బి.అనిత, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

ఔషధాలపై అవగాహన అవసరం

ఎల్‌బీకే సంస్థ అధ్యక్షులు డాక్టర్ గద్దె భానుప్రసాద్


ప్రసంగిస్తున్న భానుప్రసాద్

ఏఎన్‌యూ: ఔషధాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా ఎల్‌బీకే(లాంగ్ బీచ్ కెమిస్ట్) సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గద్దె భానుప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల, సైన్స్ కళాశాల జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగాలు సంయుక్తంగా 'మోడ్రన్ డిసీజెస్ ఆర్ ద డ్రగ్స్ ఓన్లీ ఛాయిస్ యాన్ ఇన్‌ట్రడక్షన్ కాంప్లిమెంటరీ స్ట్రాటజీస్' అనే అంశంపై శుక్రవారం ప్రత్యేక సదస్సును నిర్వహించారు . ముఖ్య వక్తగా డాక్టర్ భాను ప్రసాద్ ప్రసంగిస్తూ ఇటీవల ప్రపంచాన్ని వణికించిన కరోనా వంటి మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరు వాడుతున్న ఔషధాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కరోనా తర్వాత బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, తగు సలహాలను ఇచ్చారు. డయాబెటిక్, గుండె సంబంధిత అనారోగ్య సమస్యలు ఉన్నవారు కాంప్లిమెంటరీ మెడిటేషన్ ద్వారా లబ్ధి పొందే విధానాన్ని వివరించారు. మరొక వక్తగా పాల్గొన్న అమెరికాకు చెందిన గద్దె ప్రసూతి మాట్లాడుతూ ముఖ్యంగా పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువ శాతం అనారోగ్యానికి గురవుతున్నారని వారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ క్రమంలో ఔషధాలపై కనీస అవగాహన పెంచుకోవాలని చెప్పారు. సదస్సుకు ఓఎస్‌డీ ఆచార్య కె. సునీత అధ్యక్షత వహించారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రమీలారాణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గంగాధరరావు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎల్. ఉదయ్ కుమార్, అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రత్తిపాడు: పేకాట ఆడుతున్న ఏడుగురిని వట్టిచెరుకూరు పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వట్టిచెరుకూరు మండలం యామర్రు శివారు పొలాల్లో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న స్పెషల్ బ్రాంచి సమాచారం మేరకు శుక్రవారం వట్టిచెరుకూరు పోలీసులు జూద స్థావరంపై దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 20,350ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెదకాకాని: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తక్కెళ్లపాడు శివారులోని జాతీయ రహదారిపై ఈనెల 14న ఒక వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో అతడి తలకు, ముఖానికి గాయాలయ్యాయి. బాధితుడ్ని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మరణించాడు. సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు శుక్రవారం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరువారితోటకు చెందిన తెల్ల కిషోర్‌బాబు (35) పెయింటింగ్ పనులు చేసుకుంటూ పొన్నూరులో నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజుల క్రితం గుంటూరువారితోటలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చి, పూటుగా మద్యం తాగాడు. అది సరిపోకపోవడంతో శానిటైజర్‌లో ఆలౌట్ కలుపుకుని తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఈనెల 18న గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం చేర్పించారు. చికిత్స పొందుతున్న కిషోర్‌బాబు మృతి చెందాడు. భార్య జీవన కళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై సమీప బంధువు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొండా వెంకటప్పయ్య కాలనీలో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన 14 సంవత్సరాల బాలికను సమీప బంధువు బహుమతులు ఇచ్చి మచ్చిక చేసుకున్నాడు. బాలికపై పలు మార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ కుమార్తెను వివాహం చేసుకోవాలని నిందితుడు శివను కోరారు. దీనికి అందుకు నిరాకరించాడు. బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సురభి సంస్థ 'మాయాబజార్' ప్రదర్శన



తెనాలి: ప్రముఖ పౌరాణిక నాటక సంస్థ సురభి సమాజంచే ఈనెల 21వ తేదీ సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో 'మాయాబజార్' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ సంయుక్త నిర్వహణలో జరిగే ఈ ప్రదర్శన వివరాలను శ్రీసాయి సంతోషి నాట్యమండలి ఆర్గనైజర్ సురభి సంతోష్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రదర్శనకు ముందు కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలు ఉంటాయని నిర్వాహక సంస్థల బాధ్యులు తెలిపారు. భారీ సెట్టింగులు, సాంకేతిక నైపుణ్యంతో అనుభవజ్ఞులైన కళాకారులచే ప్రదర్శించే మాయాబజార్‌ను కళాభిమానులు తిలకించాలని కోరారు. ఆయా సంస్థల నాయకులు గరికపాటి సుబ్బారావు, ఆరాధ్యుల కన్నా, అయినాల మల్లేశ్వరరావు, లక్కరాజు లక్ష్మణరావు, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు, అభివృద్ధే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త శ్రీలత

పెదనందిపాడు: రైతుల శ్రేయస్సు, అభివృద్ధికి గానూ పలు కార్యక్రమాలు నిర్వహించి సాగులో చేదోడువాదోడుగా ఉంటున్నట్లు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్. శ్రీలత తెలిపారు.మండల పరిధిలోని పాలపర్రు గ్రామ సచివాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రైతు భరోసా కేంద్రాలు, పంటల కొనుగోలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థుల్ని పలు గ్రామాలకు పంపించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువుకున్న విషయాలు, ఫీల్డ్‌లో జరిగే విషయాల గురించి పూర్తిగా అవగాహనకు వస్తున్నారని చెప్పారు. ప్రత్యక్షంగా రైతులు సాగులో పాటిస్తున్న పద్ధతులు గురించి పూర్తిగా తెలుసుకోవటానికి ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. అనంతరం రైతులు అడిగిన ప్రశ్నలకు, వారి సమస్యలకు పరిష్కార మార్గాల్ని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏ. సునీత, ఉప సర్పంచ్ జంపని సంజీవరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు హసీనాభాను, వై. బిందియా, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు


కబడ్డీ పోటీలో గెలుపొందిన విజేతలు

పొన్నూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు పొన్నూరులో ఉత్సాహంగా సాగుతున్నాయి. మండల స్థాయిలో జరిగిన పోటీల్లో రోజు 30 టీములు పాల్గొన్నాయి. పీఈటీలు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో నండూరు గ్రామ సచివాలయం టీంపై పట్టణంలోని జయభారత్ రెడ్డి నగర్ సచివాలయం టీం గెలుపొందింది. విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విజేత జట్టు సభ్యులు బి. విజయ్, అజయ్, వి. లక్ష్మీపతి, కె.వి. నరసింహ, ఎం బాలాజీ, ఎం. సాయి సందీప్, సీహెచ్. గీతిక, కె. యశ్వంత్, కోచ్ తాడిశెట్టి భవానీ ప్రసాద్‌ను శుక్రవారం పీఈటీలు, మున్సిపల్ అధికారులు అభినందించారు.

నేడు నారాకోడూరులో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



చేబ్రోలు: దృష్టిలోపం కేవలం ఒక సమస్య మాత్రమే కాదని, మనిషికీ ప్రపంచానికీ మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని పటాపంచలు చేయడానికే బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి పేరిట నిర్విరామ కృషి చేస్తోందని వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ లోకాన్ని చూడగలిగే అవకాశం దేవుడు అందరికీ ఇచ్చినా అనేక సమస్యలు, లోపాలతో చాలా మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్తోమత లేనివారితో పాటు వెనుకబడిన వర్గాల ప్రజలు నేత్ర సమస్యలతో జీవితాన్ని ఈడుస్తున్నారని తెలిపారు. మరికొందరు వైద్యంపై సరైన అవగాహన లేక, చికిత్స విధానాల గురించి తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్ని అధ్యయం చేసిన బజరంగ్ నేత్ర జ్యోతి వారి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. చేబ్రోలు మండలంలోని నారాకోడూరులో ఈనెల 11న బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో భాగంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరం ద్వారా కళ్లజోళ్లు అవసరమైన 652 మందికి వారి లోపం ఆధారంగా పంపిణీకి వాటిని సిద్ధం చేశామని తెలిపారు. నారాకోడూరులో శనివారం సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకూ కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని చెప్పారు. గ్రామస్తులంతా అందుబాటులో ఉండి, కళ్లజోళ్లు పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు విజ్ఞాన్స్ ఎన్‌సీసీ విద్యార్థిని ఎంపిక


నాగ సంహిత

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోఇన్ఫర్మాటిక్స్ విభాగంలోని రెండో సంవత్సరానికి చెందిన నాగ సంహిత చౌదరి ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్‌సీసీ విభాగంలో ఎంపికయ్యిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. రిపబ్లిక్ డే ప్రోగ్రాంలోని కర్తవ్య పాత్ విభాగంలో నాగ సంహిత పాల్గొంటుందని వెల్లడించారు. యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు గడిచిన కొన్ని సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికవడం గర్వకారణమని పేర్కొన్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన విద్యార్థిని నాగసంహిత చౌదరిను విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్. రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్‌సీసీ సిబ్బంది, విద్యార్థులు అభినందించారు

వీవీఐటీకి ఐయూసీఈఈ అవార్డ్స్


అవార్డ్ అందుకుంటున్న అధ్యాపకుడు గిరిబాబు


యుక్తశ్రీకి అవార్డు అందజేస్తున్న విద్యాసాగర్

పెదకాకాని: ఇంజనీరింగ్ విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రారంభించిన ఇండో యూనివర్సల్ కొలాబరేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని కేఎల్ఈ టెక్నలాజికల్ హుబ్లీ నందు ఐసీటీయుఈఈ -2024 నిర్వహించిందని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో చైర్మన్ వాసిరెడ్డి మాట్లాడారు. కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ కె. గిరిబాబుకు టీచింగ్ అండ్ లెర్నింగ్ సెంటర్ లీడర్‌షిప్ అవార్డ్, ఐటీ విభాగానికి చెందిన విద్యార్థిని కుకునూరి యుక్తశ్రీ మయుఖకు అవుట్ స్టాండింగ్ స్టూడెంట్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నటు తెలిపారు. భారత దేశంలో ఇంజనీరింగ్ విద్యా ప్రమాణాలు, పరిశోధనల నాణ్యత పెంపు కోసం కృషి చేసే ఐయూసీఈఈ ఆధ్వర్యంలో వీవీఐటీ విద్యార్థి విభాగం, టీచింగ్ లెర్నింగ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీచింగ్ ఫ్యాకల్టీ అభివృద్ధిపై దృష్టి సారించడం, వర్క్‌షాప్స్ నిర్వహించడం, ఎన్ఈపి 2020కి అనుగుణంగా విద్యార్థుల్ని సన్నద్ధం చేయడం వంటి అంశాలలో కృషి చేసినందుకు గాను డాక్టర్ కె. గిరిబాబుకు టీచింగ్ లీడర్ షిప్ అవార్డ్ అందజేశారని తెలిపారు. విద్యార్థులతో నూతన ఆవిష్కరణలు చేపట్టడం, ప్రాజెక్ట్స్, కోలాబ్రేషన్ వంటి అంశాలలో కృషి చేసినందుకు గాను యుక్తశ్రీ అవుట్ స్టాండింగ్ స్టూడెంట్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ దక్కించుకున్నట్లు వివరించారు. అనంతరం యుక్తశ్రీని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, ఐయూసీఈఈ సభ్యుడు డాక్టర్ కె.వి.ఎల్. సోమశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

21న తిరుపతి నుంచి విజయవాడకు మహా పాదయాత్ర

నెహ్రూనగర్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఈనెల 21న తిరుపతి నుంచి విజయవాడ వరకు మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు నేషనల్ ధోబీ మహాసంగ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. చుట్టుగుంటలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం మహా పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రజకులు 18 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్సీలుగా మరి కొన్నిచోట్ల ఎస్టీలుగా కొనసాగుతున్నారని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, నాయకులు పాల్గొన్నారు.